# పంది

**మణిభూషణ్**

గల్పిక

**అక్కడంతా అల్లకల్లోలంగా ఉంది.**

**అరగంట నుంచి ఆ దారిన పోయే వాళ్లంతా ముక్కున వేలేసుకునో... ముక్కు మూసుకునో... వెళ్తున్నారు.**

**రోడ్డు పక్కన చిన్న బురద గుంటలో చేరిన పంది ఈ హడావుడికి కారణం!**

ప్రతి అయిదు నిముషాలకొకసారి... బయటకు వచ్చి ఒళ్లంతా విదుల్చుకుంటూ, తన ఒంటికి అంటిన బురదను పదిమందికీ పంచుతూ... ఆ పంది మళ్లీ బురదలో పొర్లాడుతోంది. ఆ సమయంలో అది అనుభవిస్తున్న అనిర్వచనీయమైన ఆనందం అంతా ఇంతా కాదు.

ఇంతలో... దాని ఆనంద హేలకు ఎవరో ఆటంకం కల్పించారు. ఒక రాయి తీసుకుని బురదలో పడకుండా నేర్పుగా దానికే గురిచూసి కొట్టడంతో ఉలిక్కిపడి చూసింది. గురి గాడి చూపు తీక్షణంగా ఉండడంతో బయటకు దుమికి పరుగుదీసింది.

హమ్మయ్య... అనుకున్న తర్వాత పరుగునాపి నడక సాగించింది. తనలో తాను ఏదో అనుకుంటూ... తన గురించి తాను ఆలోచిస్తూ...

'నేనేమిటీ... ఆ బురదలో పొర్లాడడమేమిటీ? ఛ... ఇకపై పొర్లాడకూడదు' అని తీర్మానించుకుంది. 'తన శక్తి ఎరగడని అందరూ హనుమంతుడినంటారే తప్ప, ఏ రోజునైనా ఏ ఒక్కరైనా నా గురించి అన్నారా? నేను సామాన్యురాలినా... సంతానాభివృద్ధిలో నా రికార్డునెవరైనా అధిగమించగలరా?! పుట్టిన ఏ పిల్లయినా బక్క చిక్కిపోవడమనేది పంది జాతిలో ఉన్నదా? చేతికి ఎముక లేని వ్యక్తులుగా బలి-శిబి-దధీచి-కర్ణుల వంటి ఏ నలుగురైదుగురినో చెప్పుకుంటారు తప్ప, నన్ను అనుకున్నారా? ప్రాణికోటికి కీలకమైన వెన్నెముకే లేదు గదా నాకు! అటువంటి విశిష్ట పుట్టుక కలిగిన నన్ను ఏ ఒక్కరైనా గుర్తించి గౌరవించారా?'

'అసలు, నా పుట్టుకే విశ్వ శ్రేయస్సు కోసం కాదా? నేనే గనుక అవతరించి ఉండకపోతే ఈ భూ మండలం ఏమయ్యేది? హిరణ్యాక్షుడి ప్రతాపానికి వడవడ వణుకుతూ... అంబోధిలో కూరుకుపోవలసిన భూ మండలాన్ని నేను కాదా రక్షించింది? నా ముట్టెపై వాడి కోరల మధ్య అవలీలగా భూమిని మోశాను. మరి ఏ ఇతర గ్రహ మండలానికి ఇటువంటి ముప్పు తలపెట్టకుండా హిరణ్యాక్షుడిని మట్టుబెట్టాను. శ్రీహరి తలపెట్టిన ఆ యొక్క దుష్టశిక్షణా కార్యక్రమం నా యొక్క అవతారంతోనే కదా ఆరంభమయ్యింది. అంతకుమునుపు ఎత్తిన మత్స్య, కూర్మావతారాలలో విష్ణువు ఎవ్వరినైనా హతమార్చాడా? శ్రీ మహావిష్ణువును హీరోను చేసిన అవతారం నాది... పోనీ, డబ్బా ఎక్కువయింది అనుకుంటే... శ్రీ మహావిష్ణువు హీరోయిజాన్ని ప్రదర్శించడం నా అవతారంతోనే మొదలు కదా...! అంతటి విశిష్టమైన, పౌరాణిక ప్రాశస్త్యమైన నాకు ఎక్కడైనా ఒక్క గుడి గోపురాలను కట్టారా? ఇంత చురుకైన నన్ను కాదని మందకొడిగా మసిలే తాబేలుకు 'శ్రీకూర్మం'లో గుడి కడతారా? నా చురుకు ముందు ఈ అవతారాలన్నీ ఏపాటి?! ఒక్క రాముడో, పరశురాముడో మాత్రమే నా వీరావతారంతో సరితూగగలరు'

'నా అంత చక్కని విగ్రహం, నాకున్నంత నిగ్రహం జీవకోటిలో ఏ ఒక్కరికైనా ఉన్నాయా? తిండి పుష్టిగలవాళ్లను పోల్చాలంటే నాతోనే కదా! పనిగండం ఉన్నవాళ్లకు నేను తప్ప మరో ఉదాహరణ ఉన్నదా! మందగమనంలో నన్ను ఏ హంస అయినా మించగలదా! మరి శరీర ఛాయలోనో...? నా వంటి ఛాయకు సాటి వచ్చే రంగే లేదు!'

'అయినా వీళ్లందరినీ అనుకుని ఏం లాభం? కొంత నా తప్పుకూడా ఉందిలే. మేలైన శ్రీమహావిష్ణు అంశలో జన్మించి ఇలా బురదలో పడి దొర్లడమేమిటీ? నా వంటికంటిన బురదను అందరికీ అంటిస్తూ ఆనందించడమేమిటీ? ఇక, ఇలా అయితే నన్ను మరీ 'పంది'లా చూస్తారు. ఇకమీదట, నేను బురదలో పొర్లను. బురద వంక చూడను. బురద అంటించుకోను. ఎవరికీ అంటించను..... నేను ఇకపై పందిని కాను, వరాహాన్ని.. వరహాలవంటి వరాహాలకు రాజును...'

ఇలా తలపోస్తూ, వగపోసుకుంటూ నడుస్తున్న వరాహ రాజు ముక్కు పుటాలకు ఏదో ఇంపైన కంపు సోకింది. ఆ కంపుతో కైపెక్కింది. మళ్లీ ఇంతసేపూ తలపోసుకున్నదంతా గుర్తొచ్చింది. మళ్లీ ఆలోచించనారంభించింది.



'నా తప్పు ఏముంది? బురదలో పొర్లినా నేను నేనే గానీ, నందిని కాలేను కదా! నంది నావలే పొర్లగలదా? నాకు బురద అంటినా, నేను ఎవరికైనా అంటించినా అంతా ఆ 'పై వాడి ఆజ్ఞానుసారమే' కదా! శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారే... మరి నేను అనగా సాక్షాత్తు శ్రీమహా విష్ణువుగారి తృతీయ అవతారాన్ని... అట్టి నేను ఇతరులకు బురదనంటిస్తే నా తప్పు ఎలా అవుతుంది. ఇట్టి తర్క వితర్కాలకు పోయి నా అవతార సహజగుణమైన పొర్లు స్నానాన్ని ఎలా మానుకోవడం. బురదలో పుట్టిన పద్మం ఎంత గొప్పదో... బురదలో పొర్లిన పంది కూడా అంతే గొప్పది అని ఈ జీవకోటి గుర్తించే వరకూ పొర్లుతాను...' అని తీర్మానించుకుంది.

అంతే...

అక్కడ మళ్లీ అల్లకల్లోలం ఆరంభమైంది. అది, ఎంతసేపైనా సాగవచ్చు...